క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ తొలి సమావేశం నేడు

మునగపాక: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి జిల్లా కార్యవర్గ తొలి సమావేశం ఆదివారం జరుగుతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు అనకాపల్లి రింగ్ రోడ్డులోని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ క్యాంపు కార్యాలయంలో సమావేశం జరుగుతుందన్నారు. జిల్లా కమిటీకి సంబంధించి కార్యవర్గ సభ్యులు సమావేశానికి హాజరుకావాలని ప్రసాద్ కోరారు.

నేడు ఏకదశ రుద్రాభిషేకం

మునగపాక : తిమ్మరాజుపేటలో ఆదివారం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. భగవాన్ సత్యసాయిబాబా శత జన్మదిన ఉత్సవాల్లో భాగంగా లోక కళ్యాణార్థం ప్రత్యేక రుద్రాభిషేకం కార్యక్రమం జరుగుతుందన్నారు. ఉదయం 6గంటల నుంచి శోభాయాత్ర, గోపూజ, పతాకావిష్కరణ జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. భగవాన్ సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో నిర్వహించే రుద్రాభిషేకం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

నేవీ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

రాంబిల్లి : నేవీ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె. లోకనాథం డిమాండ్ చేశారు. రాంబిల్లిలో శనివారం సీపీఎం మండల నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ ఐదు నెలల పాటు నేవీ నిర్వాసితులు ధర్నా చేస్తే సమస్యలు పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారన్నారు. ఆయా హామీలు అమలు చేయాలని కోరారు.

గడ్డికోత యంత్రాల పంపిణీ



చినబొడ్డేపల్లిలో పాడి రైతులకు గడ్డి కత్తిరింపు యంత్రాలు అందజేస్తున్న సర్పంచ్ శివరామ్

కోటవురట్ల: పాడి రైతులకు ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోందని సర్పంచ్ పైల శివరామ్ అన్నారు. చినబొడ్డేపల్లిలో పశు సంవర్ధక శాఖ ద్వారా ఐదుగురు పాడి రైతులకు గడ్డి కత్తిరింపు యంత్రాలను సర్పంచ్ శివరామ్ చేతుల మీదుగా శనివారం అందజేశారు. సర్పంచ్ మాట్లాడుతూ రైతు సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనేక విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. గడ్డి కత్తిరింపు యంత్రం పాడి రైతుకు నేస్తం లాంటిదన్నారు. ఈ యంత్రాలను పశు సంవర్ధక శాఖ ద్వారా రాయితీ పోను రూ.20,382కు అందిస్తున్నారన్నారు.

బొడ్డేడకు సత్కారం



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్‌ను సత్కరిస్తున్న బాబ్జీ

మునగపాక : వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్‌ను శనివారం ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ద్వారపురెడ్డి బాబ్జీ ఘనంగా సత్కరించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గం నియామకంలో భాగంగా యలమంచిలి నియోజకవర్గం అచ్యుతాపురం మండలానికి చెందిన బాబ్జీని పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమించడంతో బొడ్డేడ క్యాంపు కార్యాలయంలో ప్రసాద్‌ను శాలువాతో సత్కరించారు.

చంద్రబాబు,లోకేష్‌లపై ఫిర్యాదు



ఎస్‌ఐ నారాయణరావుకు ఫిర్యాదు అందజేస్తున్న గోపాలకృష్ణ

కోటవురట్ల/ఎస్.రాయవరం: ప్రజల్లో విద్వేషాలు నింపి, రెచ్చగొట్టే వ్యాఖ్యలతో దాడులకు పురిగొల్పుతున్న టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, అతని కుమారుడు లోకేష్, రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదులందాయి. వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా మండల కన్వీనర్ కొల్లు గోపాలకృష్ణ కోటవురట్ల ఎస్‌ఐ నారాయణరావుకు, పాయకరావుపేట నియోజకవర్గ సోషల్ మీడియా కో కన్వీనర్ చేపల రాజు ఎస్.రాయవరం హెడ్ కానిస్టేబుల్ భూలోకరావుకు శనివారం వేర్వేరుగా ఫిర్యాదులు చేశారు.

‘పాల’న ప్రోత్సాహకరం

- రాయితీపై పశుగ్రాసం విత్తనాలు, సమీకృత దాణా, గడ్డికోత యంత్రాలు
- 1962తో పాడి రైతు ముంగిటకే పశు వైద్య సేవలు



ప్రభుత్వం అందిస్తున్న పశు ఆరోగ్య సంరక్షణ కార్డు



గ్రామాల్లో పాడి రైతుల వద్దకే వెళ్లి పశు వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది



రాయితీపై పాడి రైతులకు అందించిన గడ్డికోత యంత్రం

పాయకరావుపేట : రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ వహించి పలు రాయితీలు కల్పిస్తున్నారు. పశు సంవర్ధక శాఖ ఏడీ జి.శ్రీనివాసరావు అందించిన వివరాల ప్రకారం పాడి పరిశ్రమ అభివృద్ధిపై రైతులకు పశుగ్రాసం విత్తనాలు 75 శాతం రాయితీలపై అందించడం జరుగుతోంది. 5 కేజీలు 115 రూపాయిలకు రైతులకు సరఫరా చేస్తున్నారు. అదే విధంగా పశువులకు సమీకృత దాణా 60శాతం రాయితీలపై అందిస్తున్నారు. పాడి పశువులకు గడ్డి కట్టింగ్ యంత్రాలను 40 శాతం రాయితీపై రూ.20,380లకే ప్రభుత్వం సరఫరా చేస్తుంది. అదే విధంగా పాయకరావుపేట మండలంలో గల పశువులకు చుట్టు పక్కల మండలాలకు చెందిన పశువులకు వ్యాధుల పరీక్షలకు స్థానిక మార్కెట్ యార్డ్ ఆవరణలో పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది. పశువులకు, గొర్రెలు, మేకలకు వైద్యం చేయడం కోసం ఆరోగ్య సంరక్షణ కార్డులు రైతులకు అందిస్తున్నారు. పశువులకు ఎప్పుడు ఏవిధమైన వ్యాక్సిన్‌లు, వైద్యం అందించాలో కార్డులో నమోదు చేయడం జరుగుతుంది. ప్రతి గ్రామంలోను 1962 నంబర్ గల వాహనాలు ద్వారా రైతు ముంగిటకే వైద్యం అందించే విధంగా ప్రభుత్వం శ్రద్ధ వహిస్తుంది. 1962కి ఫోన్ చేస్తే ఆ రైతు వద్దకే పశు వైద్య సిబ్బంది హాజరై పశువులకు వైద్య సేవలు అందిస్తున్నారు. అదే విధంగా పశువులకి ముద్ద చర్మ వ్యాధికి, ఆవులు, ఎద్దులకు వ్యాక్సిన్‌లు అందించి వైద్య సేవలు చేస్తున్నారు. ఇంతవరకు వైఎస్సార్ చేయూత పథకం ద్వారా పాయకరావుపేట, నాతవరం మండలాల్లో 1500 మందికి పాడి పశువుల కొనుగోలుకు ఆర్థిక సాయం రూ.18,500 ప్రభుత్వం అందించింది. దీంతో పాటు ఆయా డ్వాక్రా సంఘాల్లో మహిళలు స్త్రీ నిధి ద్వారా పాడి పశువులు కొనుగోలుకు రుణాలు తీసుకుని, పాడి అభివృద్ధికి సద్వినియోగం చేసుకున్నారు. త్వరలో రైతులకు పాడి పరిశ్రమను అభివృద్ధి చేయడం కోసం ఆప్కాబ్ ద్వారా మినీ డెయిరీలు ఏర్పాటుకు పశువులను కూడా అందించే విధంగా చర్యలు తీసుకుంటుంది. అదే విధంగా ప్రభుత్వం, అమూల్ డెయిరీ సంస్థ ఒప్పందం మేరకు గ్రామాల్లో పాడి పశువులను లెక్కించడం కోసం వివరాల సేకరణ చురుగ్గా జరుగుతోంది. పాలవెల్లువ కార్యక్రమంలో భాగంగా గ్రామ వలంటీర్లు గ్రామాల్లో తిరిగి పాడి పశువులు, పాడి రైతులు, పాల సేకరణ వివరాలను నమోదు చేస్తున్నారు.

త్వరలో మినీ డెయిరీల ఏర్పాటు



రాష్ట్ర ప్రభుత్వం పాడి పరిశ్రమ అభివృద్ధికి పాల వెల్లువ ద్వారా వివరాలు సేకరిస్తున్నాం. గడ్డి కోత యంత్రాలు, పశు గ్రాస విత్తనాలపై రాయితీలు కల్పిస్తున్నాం. గ్రామాల్లో 1962 ద్వారా పశువులకు వైద్యా సేవలు అందిస్తున్నాం. త్వరలో మిని డెయిరీలు ఏర్పాటుకు కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

– జి.శ్రీనివాసరావు, ఏవో పాయకరావుపేట

మహిళల రక్షణ కోసమే దిశా యాప్



నక్కపల్లి గురుకుల పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ శిరీష

నక్కపల్లి : మహిళల రక్షణ కోసమే ప్రభుత్వం దిశ చట్టాన్ని ప్రవేశపెట్టిందని సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని నక్కపల్లి ఎస్‌ఐ శిరీష తెలిపారు. శనివారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నర్సీపట్నం సబ్ డివిజన్ క్రైమ్ స్పాట్ ఇన్‌చార్జ్ కె. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నక్కపల్లి గురుకుల పాఠశాల లో విద్యార్థినులకు, జీడిపిక్కల పరిశ్రమలో పనిచేసే కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలు ఏవిధంగా జరుగుతాయి. వాటిని ఎలా గుర్తించాలి, ఎలా ఎదుర్కోవాలి, ఎవరికి ఫిర్యాదు చేయాలనే దానిపై వివరించారు. దొంగతనాలు జరగకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలు, నేరస్థల పరిరక్షణ, ఆపదలో ఉన్న సమయంలో ప్రభుత్వం రూపొందించిన దిశా చట్టం, మొబైల్ యాప్, దిశా యాప్ ఉపయోగం, దిశ పోలీసులకు ఏవిధంగా సమాచారం అందించాలో అవగాహన కల్పించారు. దిశా యాప్‌ను ఉపయోగించుకుని ఆపదలో ఉన్న వారు ఎలా తమను తాము కాపాడుకున్నారనే విషయాలను తెలియజేశారు. ఈ యాప్ వల్ల ఆపదలో ఉన్నవారి వద్దకు క్షణాల్లో పోలీసులు రాగలుగుతున్నారన్నారు. ఈవ్‌టీజింగ్, మైనర్ డ్రైవింగ్స్‌పై అవగాహన, మహిళా చట్టాలు గురించి తెలియజేశారు. టోల్ ఫ్రీ నంబర్లు 100, 112 గురించి తెలియజేశారు. సైబర్ నేరగాళ్లు చేసే మోసాలు, వారి నుంచి అప్రమత్తత, అపరిచిత వ్యక్తుల సమాచారం పోలీసులకు అందించడం వంటి అంశాలను వివరించారు. దొంగ సొత్తును కొనుగోలు చేయడం వల్ల ఎదుర్కొనే ఇబ్బందులను వివరించారు. పోలీసు చట్టాలను తెలిపి, వాటిని ప్రజలు ఏవిధంగా ఉపయోగించుకోవాలో తెలియేశారు. కార్యక్రమంలో గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ సువర్ణ, జీడిపిక్కల ఫ్యాక్టరీ మేనేజర్ వాసు క్రైమ్ స్పాట్ సిబ్బంది శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జేజేఎం పనుల్లో అవకతవకలపై ఫిర్యాదు



జేజేఎం పైపులైను ఏర్పాటుకు గ్రామానికి తీసుకువచ్చిన పైపులు



ప్రైవేటు వ్యక్తుల పొలాల్లో పైపులైను

ఎస్.రాయవరం : సర్వసిద్ధి గ్రామంలో జల్‌జీవన్ మిషన్ పనులకు తీసుకువచ్చిన కొన్ని పైపులు ప్రైవేటు వ్యక్తులు పొలాల్లో వేసుకోవడంతో గ్రామస్తులు శనివారం అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో నాలుగు నెలలుగా ఉచితంగా ఇంటింటికి పైపులైను ఏర్పాటు, గ్రామంలో అదనపు రక్షిత మంచినీటి ట్యాంకు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ పనుల్లో కాంట్రాక్టురు పలు అక్రమాలకు పాల్పడుతున్నట్టు గ్రామస్తులు ఆరోపణలు చేస్తున్నారు. ట్యాంకు నిర్మాణం ప్రారంభంలో నాసిరకం ఇసుక ఉపయోగిస్తున్నాడని ఫిర్యాదు చేయగా అధికారులు సరి చేశారు. ఇప్పుడు తాగునీటి పైపులైను ఏర్పాటు కోసం తీసుకువచ్చిన పైపులైను ప్రైవేటు వ్యక్తులకు పొలాల్లో ఏర్పాటు చేస్తుండడంతో గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీనివాస్‌ను వివరణ కోరగా గ్రామంలో కాంట్రాక్టరు ఎంత పైపు వేశారనే పరిగణనలోనికి తీసుకుని బిల్లు చేయడం జరుగుతోందని , బయటకు ఎవరికి వేసినా పరిగణనలోకి తీసుకోబోమన్నారు. చేస్తున్న పనుల్లో అక్రమాలకు పాల్పడితే బిల్లు ఆపడమే కాకుండా చర్యలు కూడా తీసుకుంటామని చెప్పారు.

మానవతామూర్తి మదర్ థెరిసా



కోటవురట్ల సీహెచ్‌సీలో థెరిసా చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సేవా సమితి సభ్యులు



పి.ధర్మవరంలో మదర్ థెరిస్సా చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కోటవురట్ల : మదర్ థెరిసా గొప్ప మానవతామూర్తి అని ఆమె అడుగు జాడల్లో నేటి తరం యువత నడుచుకోవాలని సర్పంచ్ బి.అనిల్‌కుమార్ అన్నారు. మదర్ థెరిసా సేవా సమితి ఆధ్వర్యంలో సీహెచ్‌సీలో జయంతి వేడుకను శనివారం జరిపారు. థెరిసా చిత్రపటానికి నివాళి అర్పించి రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ట్రస్ట్ డైరెక్టర్ గోపినాథ్ మాట్లాడుతూ ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా ఎదుటి వ్యక్తికి సాయం అందించినపుడే సమాజాభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాంబాబు, జైభారత్ జైహో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి త్రిమూర్తులు, డాక్టర్ కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : మధర్ థెరిస్సా వంటి సేవకులను ఆదర్శంగా తీసుకుని మంచి సమాజానికి నాంది పలకాలని పి.ధర్మవరం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.వి.రమణారావు అన్నారు. పాఠశాలలో శనివారం మదర్ థెరిస్సా 114 వ జయంతి ఘనంగా నిర్వహించారు. ప్రపంచానికే ఆదర్శమూర్తిగా పేరొందిన మదర్ సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఉపాధ్యాయులు గారా ప్రకాష్, అప్పలనాయుడు, కుసుమ కుమారి పాల్గొన్నారు.

అచ్యుతాపురం(అనకాపల్లి): మండలంలోని శాఖా గ్రంథాలయంలో శనివారం మదర్ థెరిస్సా 114వ జయంతిని నిర్వహించారు.ఈ సందర్భంగా లైబ్రేరియన్ కోటేశ్వరరావు మదర్ థెరిసా చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మదర్ థెరిసాను స్ఫూర్తిగా తీసుకొని సమాజ సేవ చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు పాఠకులు పాల్గొన్నారు.

ఘనంగా నూకాంబిక అమ్మవారి విగ్రహ ప్రతిష్ట



అమ్మవారి విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న భక్తులు

మునగపాక : తిమ్మరాజుపేట దళితవాడలో శనివారం నూకాంబిక అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా జరిగింది. సమరసత సేవా ఫౌండేషన్, తిరుమల తిరుపతి దేవస్థానం సంయుక్త నిర్వహణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీపీ జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, సర్పంచ్ మంగలక్ష్మి,ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రామ్మోహనరావు, ఫౌండేషన్ జిల్లా ధర్మప్రచారకుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు



వార్షికోత్సవాల్లో ఆటలాడుతున్న విద్యార్థులు

మునగపాక : వాడ్రాపల్లిలో స్వర్గీయ పెతకంశెట్టి జోగినాయుడు గ్రంథాలయ వార్షికోత్సవాల్లో భాగంగా శనివారం విద్యార్థులకు పలు రకాల ఆటల పోటీలు నిర్వహించారు. 12వ వార్షికోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఆటల పోటీల్లో విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. విజేతలకు ఈ నెల 28న బహుమతులు అందజేస్తామని గ్రంథాలయ గౌరవ అధ్యక్షుడు పెతకంశెట్టి రామజోగినాయుడు తెలిపారు. సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, పెద్దలు మళ్ల వరహా నరసింగరావు, చక్రవర్తి, కన్నుంనాయుడు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో మోస్తరు వర్షం



రాంబిల్లి సమీపంలో రోడ్డుపై నిలిచిన నీరు

మునగపాక : మండల వ్యాప్తంగా వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొద్ది రోజులుగా వర్షాలు లేకపోవడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. ఖరీఫ్ వరిసాగుకు ఉపక్రమించే తరుణంలో వర్షాలు ముఖం చాటేయడంతో వరిసాగు ప్రశ్నార్థకంగా మారింది. అయితే శుక్రవారం, శనివారం రెండు రోజుల పాటు ఓ మోస్తరు వర్షం కురవడంతో వరి నాట్లుకు, ఉడుపులకు మేలు చేస్తుందని వ్యవసాయాధికారి జ్యోత్స్న కుమారి తెలిపారు.

రాంబిల్లి : మండలంలో పలు గ్రామాల్లో శనివారం వర్షం పడింది. దాదాపు నెల రోజుల తర్వాత ఓ మోస్తరు వర్షం పడింది. ఈ వర్షం ఎండిపోతున్న వరి నారు మడులతో పాటు వరినాట్లకు ప్రాణం పోస్తుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా వర్షానికి పలు రోడ్లపై వర్షం నీరు చేరింది. వెంకటాపురం జంక్షన్ నుంచి నేవీ మెయిన్ గేట్ వరకు గల రోడ్డుపై పలు చోట్ల గోతుల్లో వర్షం నీరు చేరింది. దీంతో రాకపోకలకు వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు.

నారు మడుల్లో కలుపు యాజమాన్యం చేపట్టాలి



రమణయ్యపేటలో రైతులకు సూచనలు ఇస్తున్న ఏవో

నక్కపల్లి : మండలంలో పలు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఉడుపులు ప్రారంభమయ్యాయని అయితే కలుపులో యాజమాన్య పద్ధతులు పాటించాల్సిన అవసరం ఉందని మండల వ్యవసాయాధికారి ఉమాప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన గుల్లిపాడు, ముకుందరాజుపేట, రమణయ్యపేటలలో క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. రైతుల నారుమళ్లను సందర్శించి రైతులకు సూచనలు చేశారు. ముదురు నారు నాటినపుడు కుదుళ్ల సంఖ్య 4నుంచి 5 మొక్కల చొప్పున నాటుకోవాలన్నారు. నత్రజని ఎరువును సిఫార్సు కంటే 25 శాతం అదనంగా పెంచి మూడు దఫాలు కాకుండా రెండు దఫాల్లో 70 శాతం దమ్ములో మిగతా 30 శాతం అంకురం దశలో వేయాలన్నారు. వరి నారు మడుల్లో అక్కడక్కడ గుంపులు గుంపులుగా నారుమడి చనిపోతుందని, ఇది పొడతెగులు లక్షణమని తెలిపారు. ఈ తెగులు ఉధృతి పెరగకుండా వెంటనే ప్రతి లీటర్ నీటికి 2 మిల్లీలీటర్ల చొప్పున హెక్సాకోనోజోల్ మందును కలిపి ఎకరా నారుమడికి పిచికారీ చేయాలన్నారు. ఇప్పటికే వరి ఉడుపులు పూర్తయి 15 రోజులు దాటిన పొలంలో అంబటి కాడ, తీగజాతి, తుంగ వంటి గడ్డిజాతి కలుపు మొక్కలు ఉన్నాయని వాటి నియంత్రణకు బిస్‌పైరిబ్యాక్ సోడియం కలుపు మందును 80 నుంచి 100 మిల్లీలీటర్ల చొప్పున, అలాగే ఆల్‌మిక్స్ 8 గ్రాముల చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరా పొలంపై పిచికారీ చేయాలన్నారు. వరి పొలంలో 20 రోజుల లోపు ప్రతి రెండు మీటర్లకు ఒక అడుగు చొప్పున కాలి బాటలు తీసుకోవాలన్నారు. తద్వారా గాలి, వెలుతురు బాగా తగిలి చీడపీడల ఉధృతి తగ్గుతుందన్నారు. వరి ఉడిచేటప్పుడు ఎరువులు వేయని వారు ఎకరానికి ఒక బస్తా డీఏపీ, 20 కిలోల పొటాష్ వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు సత్యనారాయణ, రాజేష్, రుఫియా తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో తోడపెద్దు రాట మహోత్సవం



మునగపాకలో సేవగరిడిలో మహిళలు

మునగపాక : మునగపాకలో శనివారం తోడపెద్దు రాట మహోత్సవం ఘనంగా జరిగింది. యర్ర వెంకయ్య తోడపెద్దు పాలుకొలుపు కార్యక్రమాన్ని సెప్టెంబర్ 2న ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం రాట మహోత్సవం నిర్వహించారు. సెప్టెంబర్ 1వ తేదీ రాత్రి నుంచి 2వ తేదీ వరకు 18 సేవ గరిడీలు పాలుకొలుపులో పాల్గొంటాయని, ఆ రోజు గ్రామంలో సేవ గరిడీల ఊరేగింపు ఉంటుందని నిర్వాహకు లు తెలిపారు. అదేరోజున భారీ అన్న సమారాధన ఏర్పాటు చేస్తున్నారు. ఈ రాట మహోత్సవంలో గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, సూరిశెట్టి కన్నారావు, పెంటకోట జగ్గప్పారావు, ఆడారి సత్యనారాయణ, ఆడారి లక్ష్మణరావు, వేగి కృష్ణ, సూరిశెట్టి దుర్గనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లు తెగి పడి ఆరు మేకల మృతి



మృతి చెందిన మేకలతో బాధితుడు

ఎస్.రాయవరం : గుడివాడ శివారు కొబ్బరి తోటలో విద్యుత్ షాక్‌కు గురై ఆరు మేక లు మృతి చెందినట్టు బాధితుడు దార్ల వాసు తెలిపాడు. మేకలు పెంచుకుంటున్న తాను రోజూవలే మేతకు తీసుకు వెళ్లానని, కొబ్బరి తోటలో విద్యుత్ వైరు తెగిపడి, విద్యుత్ ప్రవహిస్తుండడంతో మేకలకు షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాయని, దీంతో తాను సుమారు లక్ష రూపాయలు నష్టపోయానని తెలిపారు. ఘటనపై కొరుప్రోలు విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశామన్నాడు.

నూకునాయుడికి సత్కారం



నూకునాయుడును సత్కరిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం : తిమ్మాపురం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అద్దేపల్లి నూకునాయుడు పార్టీలో చురుకైన పాత్ర పోషించాలని పాయకరావుపేట ఎమ్మెల్యే బాబూరావు అన్నారు. అమెరికా పర్యటనకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వచ్చిన నూకునాయుడును కొరుప్రోలు క్యాంపు కార్యాలయంలో శుభాకాంక్షలు తెలిపి , దుస్సాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎస్.రాయవరం పీఏసీఎస్ చైర్‌పర్సన్ నాగరాజు, జిల్లా కార్యవర్గ సభ్యుడు నీలేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో ఆహ్లాదకరంగా చెరువుల అభివృద్ధి

- కొమ్మాయిగూడెం చెరువు పనులు పరిశీలించిన ఎమ్మెల్యే రమణమూర్తిరాజు



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి

యలమంచిలి : చెరువుల అభివృద్ధితో పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడనుందని ఎమ్మెల్యే యు.వి రమణమూర్తిరాజు అన్నారు. రూ.85 లక్షలతో పట్టణంలో 13వ వార్డులో 1.70 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కొమ్మాయి గుండం చెరువు అభివృద్ధి పనులకు శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార్‌వర్మతో కలసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొమ్మాయి గుండం చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, వివిధ మొక్కల పెంపకం, రకారకాల లైట్లతో పార్కు అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని, తద్వారా పట్టణ ప్రజలకు ఆహ్లాదకరంగా ఉంటుందని తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి, కమిషనర్ కె.వీరయ్యతో కలసి చెరువు అభివృద్ధి పనులు పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరావు, అల్లెపు గుప్తా, ఎంపీపీ బోదెపు గోవింద్, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు యర్రయ్యదొర, రూరల్ వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, వార్డు కౌన్సిలర్‌లు షేక్ సయ్యిద్ బీబి, ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ స్థలాల్లో దుకాణాల నిర్వహణపై అవగాహన రేపు

అనకాపల్లిటౌన్: ప్రజా రవాణాశాఖ(ఆర్టీసీ)కు చెందిన ఖాళీ స్థలాల్లో దుకాణాల నిర్వహణపై ఈనెల 28వ తేదీ ఉదయం 11 నుంచి 12 గంటల వరకూ అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్టు ప్రజా రవాణాశాఖ జిల్లా అధికారి కె.పద్మావతి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ మేడపైన జిల్లా పీటీడీ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. చోడవరం ఆర్టీసీ కాంప్లెక్స్ పరిధిలో 6,290 చదరపు గజాల్లో వ్యాపారాలు నిర్వహించే విషయమై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు ఆమె తెలిపారు.

సాగునీటి కాలువల ఆక్రమణలపై ఫిర్యాదు



సాగునీటి కాలువల ఆక్రమణలపై డీఎల్‌డీవోకు ఫిర్యాదు చేస్తున్న రైతు సంఘ అధ్యక్షుడు మహేష్

మునగపాక : మునగపాకలో సాగునీటి కాలువల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని రైతు సంఘ అధ్యక్షుడు ఆడారి మహేష్ డీఎల్‌డీవో మంజులావాణిని కోరారు. స్థానిక మండల పరిషత్ హాలులో శనివారం సాయంత్రం జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా స్పందన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని పలు సమస్యలు ఈ కార్యక్రమం ద్వారా పరిష్కారమవుతాయని డీఎల్‌డీవో తెలిపారు. ఏఎస్‌ఐ దొర, ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రసాద్, ఈవోఆర్డీ ఈశ్వరరావు కార్యక్రమంలో పాల్గొన్నారు.